# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఓటర్ల అవగాహనా పోస్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు ఆవిష్కరించారు.

- పాఠశాలల పునః ప్రారంభం అనంతరం “వాటర్ బెల్” విధానాన్ని కొనసాగించాలని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులను ఆదేశించారు.

- శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

- కొత్త యాప్ లు, రియల్ టైమ్ సాఫ్ట్ వేర్ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) శాస్త్రవేత్త డాక్టర్ జి.అనిల్ కుమార్ సూచించారు.

- రాగల రెండు రోజుల్లో రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

======================

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 10 వేల 670 పోస్టాఫీసుల ద్వారా పోస్టల్ శాఖ ముద్రించిన ఓటర్ల అవగాహనా పోస్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా పోస్టల్ శాఖ పలు రకాల పోస్టర్లను ముద్రించి పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల అవగాహనా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తుందని తెలిపారు.

======================

కొత్త యాప్ లు, రియల్ టైమ్ సాఫ్ట్ వేర్ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) శాస్త్రవేత్త డాక్టర్ జి.అనిల్ కుమార్ సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT)

తాడేపల్లిగూడెంలో నిర్వహించిన “మాట్లాబ్  సిములింక్” అనే అంశంపై విద్యార్థులకు ఈరోజు జరిగిన వర్క్‌షాప్ లో అనిల్ కుమార్ మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో కూడిన క్షిపణులు, ఆయుధాలు, యుద్ధ వాహనాల రూపకల్పనకు డీఆర్‌డీఓ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. నాణ్యమైన, ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే విభిన్న పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ రైల్వే స్టేషన్ లో దక్షిణ దిక్కున వున్న 20 ఏళ్ల నాటి పురాతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనుల కారణంగా మూడు, నాలుగు ప్లాట్ ఫామ్ లపై రైళ్ల రాకపోకలు ఈరోజు, రేపు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు వాల్తేర్ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ తెలిపారు. ఈ నేపధ్యంలో సదరు ప్లాట్ ఫామ్ లకు ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన, ఇక్కడ నుంచి బయలుదేరాల్సిన రైళ్లను ఇతర ప్లాట్ ఫామ్ లకు మళ్లించినట్టు వెల్లడించారు. మొత్తం 20 వరకూ రైళ్లు దీనివల్ల ప్రభావితమవుతున్నట్లు ఆయన తెలిపారు. రేపు మధ్యాహ్నం నాటికి పునరుద్ధరణ పనులు పూర్తయ్యే  అవకాశం వుందని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఈరోజు ఒక ప్రకటన జారీ చేసారు. ఉగాది పండుగను ప్రజలందరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని, ఈ ఏడాదంతా జిల్లా ప్రజలకు అన్ని శుభాలు కలగాలని, ప్రతి ఒక్కరూ సుఖ:సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పాఠశాలల పునః ప్రారంభం తర్వాత కూడా “వాటర్ బెల్” విధానాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వివిధ జిల్లా విద్యాధికారులను ఆదేశించినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగింపు వరకు ప్రతిరోజు వాటర్ బెల్ నిర్వహణను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా డీఈవోలకు ఆయన సూచించారు. మూత్రం రంగును బట్టి తమ శరీరంలో నీటి లోపాన్ని గుర్తించి నీరు తాగే అలవాటును విద్యార్థుల్లో పెంపొందించేందుకు, వారు గుర్తించేలా పోస్టర్‌ను జతపరిచామని పేర్కొన్నారు. ఈ పోస్టర్‌లను పోస్ట్‌కార్డ్ సైజులో ముద్రించి ప్రతి మూత్రశాల, టాయిలెట్ బ్లాక్ ముందు అతికించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎండల తీవ్రత నేపధ్యంలో విద్యార్థుల్లో డీ హైడ్రేషన్ నివారణకు విధ్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలో వాటర్ బెల్ విధానాన్ని అమలు చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల నేపధ్యంలో  అక్రమ నగదు లావాదేవీలు, రవాణా జరగకుండా నిఘా పెంచాలని విజయనగరం ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టర్ జిల్లా స్థాయి విజిలెన్స్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ నోడల్ అధికారుల సమావేశాన్ని  తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వస్తువులు, వస్త్రాలు, ఆభరణాల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం పరికరాలను సీజ్ చేయాలని ఆదేశించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాగల రెండు రోజుల్లో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో  తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు  ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే

ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశముందని పేర్కొంది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి పేర్కొంటూ.....

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో పెన్షన్ దారుల సమస్యల పరిష్కారానికి గుంటూరు నగరంలో ఉన్న ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ కార్యాలయం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ మూడు జిల్లాల్లో ఉన్న పెన్షన్ దారులు వారి ఫిర్యాదులు నేరుగా పెన్షన్ కార్యాలయంలో అందించేందుకు ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే పెన్షన్ అదాలత్ లో అవకాశం కల్పిస్తోంది. పెన్షన్ కార్యాలయానికి రాలేని వారికి ఆన్ లైన్ లో తమ ఫిర్యాదులు అందించే వెసులుబాటు కల్పిస్తోంది. వాట్సాప్ నంబరు 94946 57463 ద్వారా పెన్షన్ దారులు ఫిర్యాదు చేసి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రావిడెంట్ ఫండ్ శాఖ గుంటూరు ప్రాంతీయ కార్యాలయం కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతా రామ రాజు జిల్లా గురుకులం ఆధ్వర్యంలో వున్న 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2024-2025 విద్య సంవత్సరానికి గాను  6వ తరగతి లో గల 60 సీట్లు 7, 8, 9వ తరగతులలో గల మిగిలిన ఖాళీ సీట్లకు ఆన్ లైన్ ద్వార దరఖాస్తు కోరుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్షను ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నరని, దీనికి సంబదించిన వివరాలకు 94910 30743, అలాగే 94910 60948 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని  ప్రకటనలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ హెచ్చరించారు. ఎన్నికలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి సంసిద్ధతతో  ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వచ్చే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రిటర్నింగ్ అధికారి స్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలకు నియమించిన ప్రతి బృందం సూక్ష్మ పరిశీలన చేయాలని, నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్న ఉద్యోగులను గుర్తించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు ఉద్యోగులను విధుల నుండి తొలగించామని తెలిపారు. ఎన్నికలలో భాగంగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, హింస, ప్రలోభాలు వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతిలో కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు అయిన ఈరోజు స్వామివారు కల్పవృక్ష వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సీత లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణ అధికారి  నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై ఈరోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా

సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర జలవనరులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల క్షేత్రాన్ని పది టన్నుల సంప్రదాయ పుష్పాలతో తిరుమల తిరుపతి దేవస్థానం అలంకరిస్తోంది. శ్రీవారి ఆలయంలో 5 టన్నులు, ఆలయం వెలుపల మరో 5 టన్నుల పుష్పాలను అలంకరణకు వినియోగిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =